విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

బోరుల్లో తగ్గిన నీరు

విశాలాంధ్ర-లింగపాలెం: ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో మెట్ట ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి తీవ్రమై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎండ ప్రభావం భూగర్భ జలాలపై ప్రభావం చూపుతోంది. మెట్ట ప్రాంతాలలో బోర్ల ఆధారంతోనే తాగునీటి సరఫరా జరుగుతోంది. ఎండ తీవ్రత వల్ల దాదాపు 15 అడుగుల లోతులో నీటి జలాలు అడుగంటాయని ముందు ముందు మరింతగా జలాలు అడుగంటే ప్రమాదం ఉందని భూగర్భ జలాల అధికారులే తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు నీటి ఎద్దడి అధికమవుతున్నా ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోకపోవడం ప్రమాదంగా మారుతున్నది. నీటి వృథా అధికంగా ఉండటంతో నీటి ఎద్దడి పెరుగుతోంది. ఒక మనిషికి రోజుకు 55 లీటర్ల నీరు అవసరం. మెట్ట ప్రాంతాలలో పలు ప్రాంతాల లోని ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు అందటం లేదు. నీరు సరఫరా అవుతున్న ప్రాంతాలలో నీరు వృధా చేస్తున్నారని

అధికారులు అంటున్నారు. అందరూ కలిసికట్టుగా నీటి ఎద్దడిని నివారించుకునేందుకు తమవంతు సహకారం అందించాల్సి ఉండగా ప్రజల్లో అవగాహన కొరవడుతున్నది. మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో దాదాపు 56 వేల మంది జనాభా ఉన్నారు. వీరికి 88 బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. భూగర్భ జలాలు అడుగంటడంవల్ల ధర్మాజీగూడెం, కొత్తపల్లి, పాచ్చనగరం, కే. గోకవరం, గణపవారిగూడెం, అన్నపనేనివారి గూడెంతోపాటు పలు గ్రామాలలో నీటి ఎద్దడి నెలకొంది. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో గ్రామీణ నీటి సరఫరాకు అధికారులు ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేస్తున్నారు. ధర్మాజీ గూడెంలో రెండు బోర్లు కొత్తగా వేయాలని నిర్ణయించారు. కొత్తపల్లి, కే.గోకవరంలలో రైతులు బోర్లను అద్దెకు తీసుకొని ఈ గ్రామాలలో నీటి సరఫరా చేస్తున్నారు. కొత్తగా వేసే బోరులను పంచాయతీ నిధులతో వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వేసిన బోర్లకు కోడ్ అనంతరం నిధులు అందించ నున్నట్లు గ్రామీణ నీటి సరఫరా అధికారులు వెల్లడించారు.

మహాత్మా జ్యోతిబాపూలే ఆదర్శనీయులు

విశాలాంధ్ర-భీమవరం: సామాజిక మార్పుకోసం తన జీవితకాలాన్ని త్యాగం చేసిన మహనీయులు మహాత్మాజ్యోతిరావు పూలే ఆదర్శ నీయులని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వెనుకబడిన తరగతులు శాఖ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే 198వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జ్యోతిబా పూలే చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి కలెక్టరు సుమిత్ కుమార్, జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల మహిళలకు చదువు ఎంతో అవసరమని గుర్తించిన గొప్ప వ్యక్తి మహాత్మా జ్యోతిబా పూలే అని తెలిపారు. మహాత్మ జ్యోతి బా పూలే 21 సంవత్సరాల వయసులో అట్టడుగు వర్గాల బాలికల చదువు కోసం 1848 సంవత్సరంలో మొదటి సారిగా బాలికలకు పాఠశాలను ప్రారంభించారని, చదువుతోనే మహిళలు ఆర్థికంగాను అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారని, ఆరోజుల్లో బాలికలకు చదువు నేర్పడానికి ఉపాధ్యాయులు దొరకడం చాలా కష్టమైందని, అందువల్ల ముందుగా భార్య కు చదువు నేర్పించారని పేర్కొన్నారు. సావిత్రిభాయ్‌ని ఉపాధ్యాయురాలుగా నియమించారని, ఆయన ఆలోచనల ప్రభావంతో విద్య, వ్యవసాయం, కులవ్యవస్థ, వితంతువులకు చేయూత మహిళలకు విద్య, అస్పృశ్యత నివారణపై ఎక్కువ ప్రభావం చూపిందన్నారు. 2024 మే 13 న జరగనున్న ఎన్నికలలో కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే యువత కులాలు, మతాలు,పార్టీలు చూడకుండా, ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతి రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సహాయ అధికారి కలిదిండి వేంకటేశ్వరరావు, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిరావుపూలే

విశాలాంధ్ర-ఏలూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్యకు పాటుపడిన జ్యోతిరావు పూలే అందరికి ఆదర్శప్రాయుడని జిల్లా రెవెన్యూ అధికారి డి. పుష్పామణి అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే 198 వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి డిఆర్ఓడి పుష్పా మణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా ఒక చైతన్యవంతమైన జీవితం సాగించేందుకు చదువు చాలా అవసరమని మహాత్మా జ్యోతిరావు పూలే ఆనాడే చెప్పారని అన్నారు. కుల, లింగ, వివక్షతకు తావు లేకుండా విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిరావుపూలే ఆలోచన విధానాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆయన సహచరి సావిత్రిబాయికి గురువుగా మారి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని ఆమె ఈసందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఆర్. నాగరాణి, బిసి కార్పొరేషన్ ఈడి ఎన్ .పుష్పాలత, డిఆర్‌డిఏ పిడి ఆర్ .విజయరాజు, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎన్. సత్యనారాయణ, పశు సంవర్ధకశాఖ జి. నెహ్రూబాబు, ఆర్ ఐ ఓ ప్రభాకర రావు, స్పెషల్ డిప్యూటి కలక్టర్లు కె. బాబ్జి దేవకీరాణి, ఎన్‌జిఓ నాయకుడు చోదగిరి శ్రీనివాస్,దేవరకొండ వెంకటేశ్వర్లు,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.12.92 కోట్ల విలువైన నగదు,వస్తువులు సీజ్

విశాలాంధ్ర-ఏలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ.50 వేల కంటే ఎక్కువ నగదు లభిస్తే వెంటనే సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నగదు ఎన్నికలకు సంబంధించినదని తేలితే, వెంటనే సీజ్ చేసి కేసు నమోదు చేయాలని, ఎన్నికలతో సంబంధం లేకపోతే, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలన్నారు.స్వాధీనం చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను నమోదు చేసి, వాటి యాజమానికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. సీజ్ చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను ఇఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. యఫ్.యస్.టి, పోలిస్ ఎన్ఫోర్స్మెంట్ ద్వారా చేబట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికలు కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.12.92 కోట్ల విలువైన నగదు,బంగారం,మద్యం,ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. ఇందులో రూ.162.97 లక్షలు నగదు కాగా, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.106.49 లక్షల విలువైన 35,229 లీటర్ల మద్యం స్వాధీన పరచుకున్నారు.

అంబేద్కర్ జయంతి నిర్వహణకు కోడ్ అడ్డంకి కాదు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహణకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అడ్డంకి కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని ఆంధ్ర ప్రదేశ్ అంబేద్కర్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి టియస్ స్నేహన్ బుధవారం ఒక ప్రకటనలోతెలిపారు. దళిత నాయకులైన అంబేద్కర్ ,జగజ్జీవన్ రామ్ పుట్టిన రోజు వేడుకల కోసం ఏప్రిల్ ఒకటవ తేదీనే రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ కార్యదర్శి కె. హర్ష వర్దన్ పేరున ఆదేశాలు వెలువడ్డాయని తెలిపారు. ఈ ఆదేశాలు ఆలస్యంగా వెలుగు చూసాయని చెప్పారు. ఈ ఆదేశాలు ప్రకారం ప్రతీ జిల్లాలో ప్రభుత్వ పరంగా నాయకుల జయంతి వేడుకలు జరపాల్సి ఉందన్నారు. ఈ వేడుకల నిర్వహణకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అడ్డురాదని వివరించారు.

తోట గృహాన్ని ముట్టడించిన మంతెన వర్గీయులు

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలు చేస్తున్న ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు కు అన్యాయం చేయవద్దని ఇచ్చిన టికెట్ ను వెనక్కు తీసుకుంటే ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడబోమని ఉండి నియోజకవర్గం టిడిపి నాయకులు అల్టిమేటం ఇచ్చారు. రామరాజు కు ఇచ్చిన టికెట్ ను వెనక్కు తీసుకోవద్దని గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న వందలాది మంది రామరాజు వర్గీయులు గురువారం టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి నివాసాన్ని ముట్టడించి వంటా వార్పు చేసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు వర్గీయులు మాట్లాడుతూ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎన్నో ఆటుపోట్లు తట్టుకుని నిలబడ్డారని వారందరికీ తొలి జాబితాలోనే సీట్లు కేటాయిస్తున్నామని చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని వారు ఎత్తి చూపుతున్నారు. విలువలకు, క్రమశిక్షణ కు కట్టుబడిన టిడిపి ఇప్పుడు మాట మార్చి రామరాజు కు ఒట్టి చేతులు చూపడం అన్యాయమని రామరాజు కు న్యాయం జరిగే వరకు ఆందోళనలు విరమించేదిలేదని నాయకులు తెగేసి చెప్పారు. దీనిపై స్పందించిన తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, ఠాగూర్ కోటేశ్వరరాజు, యశోద కృష్ణయ్య, కాళ్ల, ఉండి, పాలకోడేరు, ఆకివీడు క్లష్టర్ ఇన్ ఛార్జ్ లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఈవీఎం, వివిపాడ్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ

విశాలాంధ్ర-ఏలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం, వివిపాడ్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల సమక్షంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహణకు సంబంధిత అధికారులకు, సిబ్బందికి విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలకు ఈవీఎం, వివిపాడ్స్ యంత్రాలు కేటాయింపు చేయడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో ఈ ప్రక్రియ నిర్వహిస్తా మన్నారు. ప్రతి నియోజకవర్గానికి 120 శాతంగా యంత్రాలు కేటాయింపు చేయాలని ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఆ మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈవీఎం, వివిపాడ్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. పోలీస్ బందోబస్తు మధ్య వాటిని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలిస్తామన్నారు. జిల్లాలోని 1743 పోలింగ్ స్టేషన్లకు 4184 బ్యాలెట్ యూనిట్లు, 4184 కంట్రోల్ యూనిట్లు, 4534 వివిప్యాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈవీఎం, వివిపాడ్స్ ర్యాండమై జేషన్ ప్రక్రియ నిర్వహణకు ముగ్గురు అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు.ఈ ప్రక్రియ నిర్వహణకు పోలీస్ బందోబస్తు బ్యార్ కేడింగ్, మెడికల్ క్యాప్, జి పి యస్ వాహనాల ఏర్పాటు తదితరాల సంబందించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక హోదా ఇచ్చేది కాంగ్రెస్ మాత్రమే

ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేది, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేది కాంగ్రెస్ పార్టీయేనని ఏలూరు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి కావూరి లావణ్య అన్నారు. ఏలూరులో ఎంపి అభ్యర్థి కావూరి లావణ్య క్యాంపు కార్యాలయం వద్ద ఏలూరు పార్లమెంట్ స్థాయి 7 అసెంబ్లీ నియోజక వర్గాల ఎంఎల్ఏ అభ్యర్థులతో జిల్లా,మండల స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులతో లావణ్య గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు, చింతలపూడి ఎంఎల్ఏ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా, పోలవరం ఎంఎల్ఏ అభ్యర్థి దువ్వెల సృజన, నూజివీడు ఎంఎల్ఏ అభ్యర్థి మరీదు కృష్ణకైకలూరు అభ్యర్థి బొడ్డు నోబుల్, ఉంగుటూరు అభ్యర్థి పాతపాటి హరికుమార్ రాజు,దెందులూరు అభ్యర్థి ఆలపాటి నరసింహ మూర్తి పాల్గొన్నారు.ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు.మే 13 వ తేదీన జరిగే ఎన్నికల్లో ఏలూరు ఎం పి అభ్యర్థితో బాటు 7 అసెంబ్లీ నియోజక వర్గాల ఎం ఎల్ ఏ అభ్యర్ధుల గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ ఉన్న మాట్ల ఎలీజా తదితరులు మాట్లాడారు.ఈ ఆత్మీయ సమావేశానికి జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాల నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర-టి నరసాపురం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జగన్మోహనరెడ్డి తోనే సాధ్యం అని పోలవరం శాసనసభ్యుడు తెల్లం బాలరాజు తెలిపారు. టి నరసాపురం పంచా యతీలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించి సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆయన తెలిపారు. చంద్రబాబు బూటకపు మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి వైసిపి ఏలూరు పార్లమెంటు అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, వైసిపి పోలవరం నియోజకవర్గం అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి లను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం టి నరసాపురం మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొరుముచ్చు గోపాల్ యాదవ్, ఎంపీపీ డి లక్ష్మి, వైసిపి మండలం కన్వీనర్ శ్రీను రాజు తదితరులు పాల్గొన్నారు.

ORIGINAL DOCUMENT MISSING

I **GOLUGURI LOHITH SURYA SATYANARAYANA REDDY** S/o. **Srirama Reddy,** Resident at H.No. 27-17-56/A,A.S.R Nagar, Opp.Surya Towers, Bhimavaram-2, Bhimavaram Mandal, W.G.Dist, A.P -534202. Inform to all public that while I am Procedings from My Home to Seesali Village for attending my factory visit at seesali vilage the said original property Document was droped from Polythin cover on **Date.05-4-2021** Lost my original Site Document No. **6173/2021** could not find even after searching so I request if any one finds the same kindly hand over at the above address.

CHANGE OF NAME

I, Gunda Vijaya Lakshmi, W/o Jaddu Ranga Rao Naidu, resident address 1-60, Pallam Raju Thota, Nandamuru Garuvu, Veeravasaram Mandal, WG Dist, AP-534243. I have changed my name from **Jaddu Vijaya Lakshmi (Old Name)** to **Gunda Vijaya Lakshmi (New Name).** Hence after all my documents and correspondence will be continue with my **New Name Gunda Vijaya Lakshmi.**

సుబ్బారావు మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోట

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర- తణుకు: తణుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు కోరాడ సుబ్బారావు మృతికి సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గురువారం తణుకు పట్టణంలో సుబ్బారావు నివాసంలో ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ తణుకు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి జరిగిన అనేక ఉద్యమాలు, పోరాటాల్లో సుబ్బారావు క్రియాశీలక పాత్ర నిర్వహించారన్నారు. కార్మిక హక్కుల సాధనకు సుదీర్ఘకాలం పాటు జరిగిన అనేక మున్సిపల్ కార్మికుల సమ్మె పోరాటాల్లో సుబ్బారావు కార్మికుల్లో ధైర్యం నింపి సమ్మెలు విజయవంతానికి విశేష కృషి చేశారన్నారు. ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ బలోపేతానికి నిర్విరామంగా కృషి చేశారని,మున్సిపల్ కార్మిక సమస్యలు పైనే కాకుండా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇతర రంగాల కార్మిక సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేశారని తెలిపారు. ఏఐటీయూసి తణుకు ఏరియా ఉపాధ్యక్షునిగా, జిల్లా కమిటీ సభ్యునిగా, సీపీఐ తణుకు పట్టణ సమితి సభ్యునిగా పలు బాధ్యతలు నిర్వహించిన సుబ్బారావు ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో కార్మిక,పేద,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జరిగిన అనేక పోరాటాల్లో తనవంతు సహకారమందించేవారన్నారు. కార్మికులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం అంకితభావంతో ఎనలేని కృషి చేసిన సుబ్బారావు మృతి కార్మికోద్యమాలకు తీరని లోటుగా పేర్కొంటూ నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు,గార ప్రసాద్,బొద్దాని మురళి కృష్ణ తదితరులు సుబ్బారావు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలో దిప్పకాయలపాడు గ్రామంలో చెక్కిరెడ్డి సోమరాజు ఇంటి వద్ద షేక్ బాజీ అధ్యక్షతన శాఖ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని తెలిపారు. దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలన నుండి ప్రజలు విముక్తి చెందాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు.కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేపట్టిన నాటి నుండి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని, భారతదేశ ప్రజలను ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోడీ జగన్ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికలలో ఇండియా కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులను విస్తృత ప్రచారం చేసి గెలిపించాలని శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె మహమ్మద్, అబ్దుల్లా, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలను అనుసరించాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: సంఘ సంస్కర్త,సమాజ సేవకుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రతీ ఒక్కరూ ముందుకు తీసుకు వెళ్లాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)జిల్లా అధ్యక్షులు కె.విఘ్నేష్ పిలుపునిచ్చారు. గురువారం జ్యోతిరావు పూలే 197 వ జయంతి సందర్భంగా స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విఘ్నేష్ మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పూలే ఎన్నో పోరాటాలు చేయడమే కాకుండా ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించిన ఘనత ఫ్యూలే కు దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పారిశుధ్య విభాగం అధ్యక్షులు కొత్తూరి నాగేశ్వరావు, సెక్రటరీ బొక్క శ్రీనివాస్, ముప్పిడి శ్రీను, కొత్తూరి శ్రీను, యడ్లపల్లి రాజేంద్ర తదితర మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు మల్లికార్జున ఆచారి ఆశయాలను కొనసాగించాలి

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: దివంగత ఉపాధ్యాయ ఉద్యమ నేత, సీపీఐ నాయకులు గొల్లపల్లి మల్లికార్జున చారి ఆశయాలను కొనసాగించడం ద్వారా మాత్రమే ఆయనకు మనం నిజమైన నివాళులర్పించిన వారమవుతామని ప్రజానాట్య మండలి సీనియర్ బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు అన్నారు. లక్కవరానికి చెందిన గొల్లపల్లి మల్లికార్జున చారి వర్ధంతి సభ జంగారెడ్డిగూడెం సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం సంస్థ నిర్వాహకులు జె.శేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టీవీఎస్ రాజు మాట్లాడుతూ మల్లికార్జునచారి ఉపాధ్యాయునిగా సేవలందిస్తూ విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు ఎందరో యువతీ యువకులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా లక్కవరం పరిసర ప్రాంతంలోని అనేక మందికి సేవా దృక్పథంతో విద్యాబోధన చేసేవారని కొనియాడారు. డాక్టర్ అరుణ వందన సమర్పణతో సభ ముగిసింది.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు గురువారం మండలంలోని వేగవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి బలపరిచిన ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్,చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజయరాజు అభ్యర్థించారు.మహిళలు ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజుకు హారతులు పట్టారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి,సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పోల్నాటి బాబ్జి, మండల వైసీపీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు,మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు,మండలంలోని వైసీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: కుల,మత వివక్షతలకు వ్యతిరేకంగా అంటరానితనం, మహిళల అణచివేత,సామాజిక అసమానతలతో దేశంలో పేరుకుపోయిన సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి 150 ఏళ్ళకు ముందే ఉద్యమించిన తొలి సంఘసంస్కర్త, గొప్ప సామాజిక విప్లవవాది మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శం కావాలని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో గురువారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సామాజిక చైతన్య సాధన దిశగానే సమాజం అభివృద్ధి చెందుతుందని బలంగా నమ్మిన పూలే చాతుర్వర్ణ వ్యవస్థ నిర్మూలనకు, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారని కొనియాడారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అసమానతలకు వ్యతిరేకంగా పూలే గొప్ప పోరాటం చేశారని, పూలే స్ఫూర్తితోనే అంబేడ్కర్ సమానత్వ సాధన దిశగా ఉద్యమించారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యల కోసం, వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో నలిగిపోకుండా రైతుల్లో చైతన్యం తెచ్చారని, వారి పంటలకు గిట్టుబాటు ధరలు అందేలా రైతాంగ సమస్యలు పరిష్కారానికి ట్రేడ్ యూనియన్ నాయకుడు బొఖండేతో కలిసి మహారాష్ట్రలో ఎన్నో సమీకృత పోరాటాలను పూలే నిర్వహించారని కోనాల అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.వి.ఆనంద్, చాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

15న ముఖ్యమంత్రి జగన్ పర్యటన

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ఈనెల 15వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భీమవరం రానున్నారని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర ఎస్ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర భీమవరంలో ప్రవేశిస్తుందని అక్కడి నుండి బస్సు యాత్ర జువ్వలపాలెం రోడ్డు మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుని అక్కడినుండి బైపాస్ రోడ్డుకి ఆనుకుని ఉన్న బహిరంగ సభ వేదికకు చేరుకుంటుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన భీమవరంలో భారీ స్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. సుమారు 50 వేల మందికి పైగానే ఈ బహిరంగ సభకు నియోజకవర్గ ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, గ్రంధి రవితేజ, గ్రంధి సునీల్, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహా రావు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య,జేసీసీ కన్వీనర్లు నల్లం రాంబాబు, ఏఎస్ రాజు, నాగరాజు శ్రీనివాసరాజు, కామన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్.వి.కి "పుల్లాభొట్ల" పురస్కారం

విశాలాంధ్ర-పెనుగొండ:పెనుగొండకు చెందిన కవి, కథా, వ్యాస, నాటక రచయిత ఎం. ఆర్. వి. సత్యనారాయణ మూర్తి ,ఉగాది రోజున ఏలూరులో 'పుల్లాభొట్ల'పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా మూర్తి విలేకరు లతో ఆయన మాట్లాడుతూ ఏలూరు సాహిత్య మండలి కళా మండపంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ లక్ష్మి ఈ పురస్కారాన్ని అందజేసారని అన్నారు. 700కు పైగా రచనలు చేసి, 24 పుస్తకాలు ప్రచురితం కావడం అభినందనీయమని వక్తలు మూర్తిని కొనియాడారు. కళాకారులు కె.వి.సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు పుల్లాభొట్ల శ్రీరామ మూర్తి కుటుంబ సభ్యులు మూర్తిని సత్కరించి, రూ.5వేల నగదు అందజేసారని తెలిపారు. ఈ సందర్భంగా మూర్తిని స్థానిక ప్రముఖులు డాక్టర్ కె. రామచంద్ర రాజు తదితరులు అభినందనలు తెలిపారు. కళారత్న, అంతర్జాతీయ నాట్య కళాకారులు కె.వి.సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వర్లు,గరికపాటి కాళిదాసు, సాహిత్య మండలి కార్యదర్శి, పి. పురుషోత్తం, డాక్టర్ కె. అరుణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ అనుబంధ సంస్థ మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యంకి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి లోని జిల్లా పరిషత్ హై స్కూల్ సమీపాన ప్రధాన రహదారి ప్రక్కన ప్రతి సంవత్సరం వేసవికాలంలో ఏర్పాటు చేసే చలివేంద్రం గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి, రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చలివేంద్రాన్ని మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ లాం రాజశేఖర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దొండపాటి ఏసుపాదం మాట్లాడుతూ అయ్యంకి సురేష్ బాబు గడచిన 10 సంవత్సరాల నుండి వేసవి కాలంలో పాద చారులు దాహార్తి తీర్చు నిమిత్తం, చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రొత్త ఈదర ప్రథమ పౌరుడు బెక్కం రాజగోపాలరావు మాట్లాడుతూ ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్, ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అయ్యంకి సురేష్ బాబు ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తి మన ప్రాంత వాసి కావడం మనకు గర్వకారణం అన్నారు. ఆగిరిపల్లి గ్రామ పౌరులు లక్ష్మి విక్టర్ బాబు, దొండపాటి దినేష్, యలమర్తి భవాని శంకర్, దేవరపల్లి రమేష్, బొడ్డు పుల్లయ్య, బార్లపూడి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో సూర్య తేజ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో ప్రధాన రహదారులపై ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారిపై మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ఎం. సూర్యతేజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు ఓటు హక్కు ప్రతి ఒక్కరికి వజ్ర ఆయుధమని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన వారికి ఓటు వేసి వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం డిఎస్పి సురేష్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో బి. అశోక్ కుమార్, తాసిల్దార్ కే. రాజ్యలక్ష్మి, సిఐ మధుబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్, ఆర్ఐ మణి దివ్య, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ లీకై తాటాకిల్లు దగ్ధం

విశాలాంధ్ర- పోడూరు : మండలంలోని కవిటం శివారు పాటిమీద ప్రాంతంలో గురువారం ఉదయం ఒక తాటాకు ఇంట్లో గ్యాస్ లీకేజీ కావటంతో మంటలు చెలరేగి తాటాకిల్లు దగ్గం కాగా దాని ప్రక్కన గల మరొక తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఉడుం బాలకృష్ణ, ఉడుం కోటేశ్వరరావు, మారుమూడి రత్నమ్మ మారుమూడి శ్రీను కుటుంబాలు నివాసముంటున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ వివివి మురళీకృష్ణ ఆర్ఐ కందుల రాంబాబు వీఆర్వో ఏ వీరాంజనేయులు సంఘటన స్థలాన్ని సందర్శించి అగ్ని ప్రమాద బాధితులకు తక్షణ సాయంగా 10 కేజీల వంతున 40 కేజీల బియ్యం అందించారు

ముస్లిం సోదరులు అన్ని రంగాల్లో ఎదగాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ముస్లిం సోదరులు అన్ని విధాలుగా పైకి రావాలని, మీకు కచ్చితంగా అల్లా ఆశీస్సులు ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. నరసయ్య అగ్రహారంలోని సున్ని జామియా మజీద్‌లో గురువారం జరిగిన రంజాన్ వేడుకలలో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల పిల్లలు ఉన్నత చదువులు చదువుకుని లక్ష్యాలను సాధించేదిశగా కృషి చేయాలని, అల్లా ఆశీస్సులు మీకు ఉంటాయని అన్నారు.

దూషించడం.. మభ్యపెట్టడం చంద్రబాబు నైజం

విశాలాంధ్ర-ఆచంట: వల్లూరులో ఎన్నికల శంఖారావంలో భాగంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథ రాజు పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆశీస్సులు తీసుకొన్నారు. అయిదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేసి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిన్న మొన్నటి వరకూ చంద్రబాబు వలంటీర్లను మానసిక క్షోభకు గురి చేసి నేడు కొత్త పల్లవి అందుకొన్నారని, గోనె సంచులు మోసే ఉద్యోగం అంటూ వలంటీర్లను కించ పరిచారని, వలంటరీ వ్యవస్థ వల్ల డేటా చోరీ, కిడ్నాప్‌లు జరుగుతాయని విపరీత వ్యాఖ్యలు చేసి, చంద్రబాబుకూటమి నాయకులు నిత్యం దూషించడంతో పాటు, ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్లును ప్రజా సేవ నుంచి దూరం చేసారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్ ,రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్,ఆచంట మండల పాస్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బొడ్డు డేవిడ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్... ఎన్డీఏ కూటమిలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర-మండవల్లి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి కూటమిలోకి భారీగా చేరికలు జరిగాయి. గురువారం మండవల్లి గ్రామంలో కైకలూరు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు,పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి (బాబ్జి), చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ బాబి,నారగాని వెంకట నాగేశ్వరరావు సమక్షంలో మండవల్లి, గన్నవరం, అయ్యవారి రుద్రవరం గ్రామాలకు చెందిన వందమందికి పైగా వైసిపి నాయకులు, కార్యకర్తలు గుడివాడ చిట్టిబాబు(మాజీ సర్పంచ్) ఆధ్వర్యంలో కామినేని సమక్షంలో కూటమి తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఎన్డీఏ కూటమి కండువా కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు.

గిడ్డంగి సదుపాయం కల్పించే బాధ్యత తీసుకుంటాం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలం అభివృద్ధిలో భాగంగా ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెంలో కీలకమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి , వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పంటను నిలువ చేసుకునే గిడ్డంగి సదుపాయాన్ని ఏర్పాటు చేసే బాధ్యత తెలుగుదేశం,జనసేన, బిజెపి, కూటమిలు తీసుకుంటుందని మండల టిడిపి అధ్యక్షులు పారేపల్లి నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014లో మాట ఇచ్చినప్పటికీ కొన్ని శక్తుల వలన కార్యరూపం దాల్చలేదని అందుచేత ఈ అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని , ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన,బిజెపి కూటమి అధికారం వచ్చిన వెంటనే కచ్చితంగా అభివృద్ధి కార్యక్రమాలను సాధిస్తామని నరేష్ తెలియజేశారు.

దివ్యాంగులకు హీల్ కృత్రిమ అవయవాలు

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన కృత్రిమ అవయవాలు మరింత సౌకర్యవంతంగా దివ్యాంగులకు ఉపయోగపడతాయని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ బి. వేణుగోపా రెడ్డి అన్నారు. తోటపల్లిలోని ఎలిజబెత్ పాంటన్ లెగసీ ఆఫ్ హోప్ - హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన రావిరాల జ్యోతి, విజయవాడకు చెందిన వడ్డాది రాజు, అబ్దుల్ వజీరుద్దీన్, ఒరిస్సాకు చెందిన టక్రి జ్యోతి, గన్నవరానికి చెందిన ప్రత్తిపాటి జేమ్స్ లకు కృత్రిమ కాళ్ళను ఆయన అందచేశారు. కృత్రిమ కాళ్లకు ఆర్థిక సహాయం అందచేసిన వల్లభనేని లక్ష్మి కమల, లయన్ చలమలశెట్టి మనోజ్ కుమార్, కాటా శివనాగేంద్రమ్మలను ఆయన అభినందించారు. అనంతరం, హీల్ పాఠశాలలో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు వారి సహకారముతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను అయన ప్రారంభించారు. ఈ కార్యక్రమములో బి. సులేఖ, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సిఈఓ కూరపాటి అజయ్ కుమార్, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా

విశాలాంధ్ర- తణుకు: నియోజకవర్గంలో అభివృద్ధి, అవినీతిపై బహిరంగ చర్చకు వస్తారా అని ఎన్.డి.ఎ. కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సూటిగా ప్రశ్నించారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆరిమిల్లి మాట్లాడారు.ప్రజాగళం సభ విజయవంతం కావడంతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు కళ్ళు బైర్లు కమ్మాయని, ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా మాట్లాడేస్తున్నారన్నారు. తణుకు నరేంద్ర సెంటర్లో బహిరంగ చర్చకు తాము సిద్ధమని... సమయం తేదీ కారుమూరి చెప్పినట్లయితే, తామంతా వస్తామని ప్రజల ముందు బహిరంగంగా అన్ని విషయాలు మాట్లాడి తేల్చుకుందామని స్పష్టం చేశారు. తణుకులో ప్రజాగళం సభ విజయవంతం చేసినందుకు తెలుగుదేశం,జనసేన, బీజేపీ నాయకులకు,కార్యకర్తలకు,అభిమానులకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దొమ్మేటి వెంకట సుధాకర్, తణుకు పట్టణ తెదేపా అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, తణుకు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు చిక్కాల వేణు, ఏఎంసీ మాజీ చైర్మన్ పోలిశెట్టి చంటి, ఆల్తి సత్యనారాయణ, కడియాల సూర్యనారాయణ, తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మేలు రకమైన విత్తనాలతో రైతులకు లాభాలు

విశాలాంధ్ర-పెదవేగి: రైతులు మేలు రకమైన వ్యవసాయ విత్తనాలను ఎంచుకున్నట్లయితే లాభాలను అధికంగా పొంద వచ్చునని పెదవేగి మండలం కే కన్నాపురం రైతు బి.ఆంజనేయులు తెలిపారు. గురువారం పెదవేగి మండలం కే కన్నాపురం గ్రామంలో ఈ రైతు పండించిన వివంట సీడ్స్ వారి హైబ్రిడ్ పుచ్చకాయల పంటను రైతులు, కంపెనీ వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వివంట సీడ్స్ కంపెనీ వారు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన గింజలను ఎంపిక చేసుకున్నప్పుడే రైతులు లాభాల బాట పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివంట సీడ్స్ కంపెనీ సిబ్బంది కిషోర్, పి. వెంకటేశ్వరరావు, ముస్సే శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యవంతం చేసిన జ్యోతిబాపూలే

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: బీసీలే సమాజానికి వెన్నుముకని అలాంటి వారిని ముందుండి నడిపించి వారిలో చైతన్యం తీసుకొచ్చిన మహానేత జ్యోతిరావు పూలే అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక జనసేన కార్యాలయం వద్ద గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జనసేన పట్టణ అధ్యక్షుడు వత్తనపల్లి కాశీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడో మహారాష్ట్రలో పుట్టి బీసీల అభ్యున్నతి కోసం పోరాడి, వారిలో చైతన్యం తీసుకురావడానికి తన భార్య సావిత్రిబాయిపూలేను ఉపాధ్యాయురాలిగా ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

కైకలూరులో: సమాజంలో అసమానతలకు కుల వ్యవస్థే మూలమనే సత్యాన్ని గ్రహించి అసమానతలకు వ్యతిరేకంగా దళిత, గిరిజన, బలహీనవర్గాల ప్రజలను చైతన్య పరచి పురుషులతో సమానంగా మహిళలు విద్యను అభ్యసించాలని వారి భార్య సావిత్రి బాయి పూలే మొదలు పెట్టిన గొప్ప సంఘ సంస్కర్త, ప్రతి ఒక్కరు నవ సమాజస్థాపన కొరకు పూలే అడుగుజాడల్లో నడవాలని కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ అన్నారు. ఈ సందర్భముగా కైకలూరులోని కోరుకొల్లు, కలిదిండి జ్యోతిరావ్ పూలే సెంటర్లో జ్యోతి రావ్ పూలే 198వ జయంతి సందర్భంగా మహాత్మా పూలే విగ్రహమునకు మండల నాయకులు, గ్రామ నాయకులతో కలసి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: టిడిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించిన అనంతరం టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ భారతదేశంలో పూలే అంట రానితనం కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహానుభావుడని వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి డ్వాక్రా అంగన్వాడీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, టిడిపి నాయకులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, మైలాబత్తుల ఐజాక్ బాబు, చెల్లబోయిన గోవింద్, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, దొంగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఎన్నికల శిబిరంలో: జనసేన ఎన్నికల శిబిరంలో జ్యోతిరావు పూలే 197 వ జయంతి వేడుకలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇందుకూరి రామలింగరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు వేండ్ర శ్రీనివాసరావు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, మైలబతుల ఐజాక్ బాబు, భీమాల శ్రీరామ్మూర్తి , గూడూరి సుబ్బారావు, మెంటే గోపీ, ఎద్దు యేసుపాదం నేదునూరి గంగాధర్ తిలక్ కోండ్రు శ్రీను ముచ్చకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయిలో : 75 ఏళ్ళ స్వతంత్ర భారత దేశంలో దళితులు, బీసీలు మహిళలు చట్టసభలలో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు పదిమందిలో చిన్న చిన్న వాళ్ళ ముందు చేతులు కట్టుకుని నిలబడే విధానం కొనసాగుతుందని దీనికి స్వస్తి పలుకుదామని సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఇవి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో ఉపాధి పనుల వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

మత సామరస్యానికి రంజాన్ ప్రతీక

విశాలాంధ్ర -భీమవరం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని మాజీ ఎమ్మెల్యే, భీమవరం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజ నేయులు అన్నారు. రంజాన్ సందర్భంగా నరసయ్య అగ్రహారం లోని సున్ని జామియా ఈద్గ మైదానంలో ఆయన పాల్గొని ముస్లిమ్ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పులపర్తి మాట్లాడుతూ ఖురాన్ బోధనల ప్రభావం సమాజంపై ఎంతగానో ఉంటుందని, రంజాన్ మాసంలో చేపట్టిన ఉపవాస దీక్షలు స్వియ క్రమశిక్షణ, జీవితం పట్ల సానకూల సానకూల దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. సహనం, పరోపకారం, త్యాగం వంటి మానవీయ విలువలు రంజాన్ మాసం పెంపొందిస్తుందని పులపర్తి పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ నెల రోజులపాటు జరిగిన రంజాన్ ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు గొప్ప ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయని అన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, బండి రమేష్ కుమార్, టీడీపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను భీమడోలు మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం బుధవారం నెలవంక కనబడడంతో గురు వారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. భీమడోలు సంతమార్కెట్ మసీదు వద్దనుండి ఊరేగింపుగా ముస్లిం సోదరులు పీర్ల చెరువు ఈద్గా మైదానానికి చేరుకుని మజీద్ హిమామ్ దిల్షాద్ నేతృత్వంలో సామూహిక ప్రార్ధనలను నిర్వహించారు. అధికసంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. మజీద్ హిమామ్ దిల్షాద్ ఖురాన్ సూక్తులను వినిపించి, ప్రత్యేక ప్రార్ధనలు దువా చేయించారు. ముస్లింల జీవితంలో రంజాన్‌కు ఎంతో ప్రాధాన్యత కలదని, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ రంజాన్ మాసంలో ఆవిర్భవించిం దన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించాలన్నారు. ప్రార్ధనలు అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ చైర్మన్ షేక్ హసేనా, సైన్ షా సిద్దిఖ్, రసూల్, షరీఫ్, జానీ, మన్సూర్, గాలీబ్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా కొయ్యలగూడెం పట్టణంలో జామియా మస్జిద్ వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ముస్లిం గురువులు రంజాన్ పండుగ విశిష్టతను ముస్లిం సోదరులకు తెలియజేశారు. మండలంలో పలు గ్రామాలలో కూడా మస్జిద్ ల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ పూలే 1827లో ఏప్రిల్ 11న జన్మించారని ఆయన సంఘ సంస్కర్త, ఆలోచనాపరుడు, సామాజిక కార్యకర్త అని కొనియా డారు. అంటరానితనం, మహిళా అభ్యుదయానికి కృషి చేసిన వ్యక్తి 180 సంవత్సరాల క్రితమే శ్రామిక, కులాల ఐక్యత కోసం కృషి చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌వివిఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువత పూలే గురించి తెలుసుకోవాలి

ప్రతి ఒక్కరూ పూలే గురించి తెలుసుకోవాలని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ సూచించారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ వద్ద ఉన్న విగ్రహానికి రమేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిసెట్టి సతీష్, ఉలిసె ఐ రాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కాజులూరులో : సమాజ, సమాన హక్కుల కోసం, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం, సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని రెవిన్యూ డివిజనల్ అధికారి ఎస్. సుధా సాగర్ అన్నారు. గురువారం స్థానిక రామచంద్రాపురం ఆర్డిఓ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలను సిబ్బందితో కలిసి జరుపుకున్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పుష్ప గుచ్చాలతో శ్రద్ధాంజలి ఘటించి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమసమాజ నిర్మాణ కృషీవలుడని, భవిష్యత్తు తరాల స్ఫూర్తి ప్రధాతగా మహాత్మా జ్యోతి రావు పూలే పేరుగాంచారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రామచంద్రపురం వెంకట్రావు, కాజులూరు తహసీల్దార్ శాంతి లక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో: బడుగు వర్గాల ఆశాజ్యోతి, అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మ జ్యోతి రావు పూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని సీనియర్ అడ్వకేట్ వడ్డీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం జ్యోతిభాపూలే 197వ జయంతిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్, మాత రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిభా పూలే జయంతిని పురస్కరించుకుని పూలే చిత్ర పటానికి పూలమాలలు అలంకరించి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఆర్గనైజేషన్ సభ్యులు మాతరమా భాయ్, అంబేద్కర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు పి. రజిని, కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో : నడుపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిభాపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిడదవోలు నియోజకవర్గ బీఎస్పీ యం యల్ ఎ అభ్యర్థి గుమ్మాపు చిత్రసేను పాల్గొని మాట్లాడుతూ శూద్ర ,అతి శూద్ర కులాలకు విద్య అందించడం కోసం, సొంతంగా పాఠశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేసి జ్ఞానాన్ని పంచిన గొప్ప యోధుడు మహాత్మా జ్యోతిబా పులే అని, కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసే నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అరేపల్లి. అంజి బాబు, కప్పల. ఇశ్రాయిల్, చిటికిన. సత్తిబాబు, అరేపల్లి. నరేష్, నరమామిడి. నరసన్నలతో పాటు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరులో : జ్యోతి రావు పూలే మహోన్నతమైన వ్యక్తి అని కొవ్వూరు టిడిపి దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి కంఠమణి రామకృష్ణలు అన్నారు. వీరి ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరు పార్టీ ఆఫీస్ నందు పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సుర పని చిన్ని, నియోజకవర్గ బీసీ నాయకులు మరియు టీడీపీ- జనసేన-బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో : పేద మధ్యతరగతి వర్గాల అభ్యున్నతిక కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొవ్వూరు వైకాపా అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకల్లో వెంకట్రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకుడు 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, సుర్ల నగేష్, చెప అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో : సంఘసంస్కర్త మహాత్మా పూలే జయంతిని ఉండ్రాజవరం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం ఎస్సై వి. అప్పలరాజు మాట్లాడుతూ సామాజికంగా గానీ ఒక చైతన్యవంతమైన జీవితం సాగించేందుకు చదువు చాలా అవసరమని మహాత్మా జ్యోతిరావు పూలే ఆనాడే చెప్పారని, చెప్పడమే కాకుండా దానిని ఆచరించారన్నారు. కుల, లింగ, వివక్షతకు తావు లేకుండా విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిరావుపూలే ఆలోచన విధానాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మండల బీసీ సంఘం అధ్యక్షుడు పివి రాము మాట్లాడుతూ పూలే తన భార్య సావిత్రిబాయికి గురువుగా మారి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. బాలికలకు, మహిళలకు చదువుకునేందుకు ప్రత్యేకంగా పాఠశాలలను నెలకొల్పారని, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఆయన చేపట్టిన సంస్కరణలు చాలా గొప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం సభ్యులు గంగలకుర్తి సీతారామసాగర్, వేముల వెంకట సత్యనారాయణ, వెలిగట్ల ప్రభువరం, కోన జయ, మారిశెట్టి నాగేశ్వరరావు, సరిదే ఉదయ్ కుమార్, వీరమల్ల బాలాజీ, పెదగాడి శ్రీనివాసు, ఐశెట్టి సత్యనారాయణ, ఏలూరి బ్రహ్మాజీ, పిప్పళ్ళ దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సామాజిక వర్గం వైసీపీకి అండగా నిలవాలి

విశాలాంధ్ర - అనపర్తి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనేందుకు వ్యతిరేక శక్తులన్నీ ఏకమైన ప్రస్తుత నేపథ్యంలో రెడ్డి సామాజిక వర్గం వైసిపికి అండగా నిలబడాలని ఓసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జి. కరుణాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం అనపర్తిలో జరిగిన విలేకరుల సమావేశంలో కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి రెడ్డిలను విభజించి వైసీపీకి దూరం చేసేందుకు, ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నదని అన్నారు. రెడ్డిలను నిత్యం ద్వేషిస్తూ ఈ కుల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై నిందలు మోపుతూ చంద్రబాబు పైశాచిక ఆనందం పొందుతున్నారని కరుణాకర్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు తన సామాజిక వర్గానికి పెద్ద పీట వేసి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులను చిన్న చూపు చూసిన మాట వాస్తవమా కాదా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, సతీష్, రవి శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రజల చూపు జనసేన వైపే

విశాలాంధ్ర - సీతానగరం: ప్రజల చూపు జనసేన వైపే ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నా సేన నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని బొబ్బిల్లంక గ్రామ పంచాయితీ పరిధిలో గురువారం కూటమి పార్టీలు అయినా టీడీపీ, జనసేన, భాజపా నాయకులతో కలిసి జనం కోసం జనసేన అంటూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు వైసిపి ప్రభుత్వ పాలన పై అసహనం చెందారు అని అన్నారు. పేదల ఇళ్ళ స్థలాలు ఇస్తామంటూ ప్రకటనలకే పరిమితం అయ్యారని అన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామంటూ ప్రకటనలు చేసినా ఫ్లెక్సీలో మాత్రమే అభివృద్ధి కనబడుతుంది కానీ గ్రామాల్లో పర్యటిస్తుంటే అభివృద్ధి ఎక్కడ కనపడడం లేదని అన్నారు. ఒక అవకాశం జనసేనకు ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెండ్యాల అవిస్వామి, పోలిన కృష్ణ, పోలిన రామచంద్రం, నున్న కృష్ణ, శ్రీను, బిక్కిన సతీష్, చుట్టూరి రంగారావు జనసేన నాయకులు విజయ్ శంకర్, దూలం కృష్ణ, శశికళ తదితర టీడీపీ, జనసేన, భాజపా పార్టీల నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీఎస్పీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-పెరవలి : బీఎస్పీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని నడుపల్లి, నడుపల్లి కోట గ్రామాల్లో బియస్పీ యంయల్ఏ అభ్యర్థి గుమ్మాపు చిత్రసేను ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ సిపి, టీడీపీ, జనసేన, బీజేపీలు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తూ ఓటర్లను మోసం చేస్తున్నాయన్నారు. ఆయన వెంట నల్లి రమేష్, కప్పల ఇశ్రాయిల్, బత్తిన ఆశీర్వాదము,మర్రి మహాలక్షముడు,గొల్ల ధనరాజు, చిన్నం. వెంకటేశ్వర్లు, మోర్త. చింతరాజు,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బ్రహ్మరథం

విశాలాంధ్ర-చాట్రాయి: ఊరూరా ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని నూజివీడు నియోజకవర్గ తెదేపా అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చాట్రాయి మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా తెలుగుదేశం పార్టీకి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని అన్నారు. ప్రతి సామాన్య కార్యకర్తకు నేను అండగా వుంటానని వ్యక్తిగత బాధ్యతతో పని చేస్తానన్నారు. టిడిపి విజయం తథ్యమన్నారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే పార్థసారథిని గెలిపించుకోవడమే మార్గం అన్నారు. తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో చనుబండ ప్రభుత్వ పశు వైద్యశాలలో కనీసం వైద్యుడు కూడా లేక ఆస్పత్రి కి తాళం వేస్తే పై అధికారులకు ఫిర్యాదు చేయడం నిరసన కార్యక్రమాలు చేయడం వల్ల తాళం తీశారని గుర్తు చేశారు. తెలుగు దేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో పూర్తిగా రైతు వ్యతిరేక పాలన సాగుతోందని దుయ్యబట్టారు. తెదేపా మండల మాజీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు మాట్లాడుతూ చాట్రాయి మండలంలో ఉన్న అతిపెద్ద వైసిపి నాయకుడు ఏపీ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కి రాష్ట్రస్థాయిలో పదవి ఉన్న దాని వలన ప్రయోజనం ఏమిటని అది ఎవరికీ తెలియని పదవని దానివల్ల చాట్రాయి మండలానికి ఒరిగిందేమిటి అన్నారు. సభకు తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు చీదిరాల మారేశ్వరరావు అధ్యక్షత వహించగా తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులుజగ్గవరపు వెంకట రెడ్డి నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రాయపూడికి రబీంద్ర రత్న సేవా పురస్కారం

విశాలాంధ్ర - పాలకొల్లు : ఉత్తమ ఉపాధ్యాయుడు, ప్రముఖ సామాజిక వేత్త, ఎవరికి కష్టం వచ్చినా నేనున్నా అంటూ ముందుకు వచ్చి చేయూతనిస్తూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రాయపూడి భవాని శంకర్ ప్రసాద్‌కు రబీంద్ర రత్న పురస్కారం లభించింది. ఈ విషయాన్ని గురువారం ఆయన ఒక ప్రకటనలో మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా భవాని ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. తనకు పురస్కారాలు లభించడం కొత్త కాదన్నారు. ఉత్తమ విద్య, విద్యార్థులకు సౌకర్యాల కల్పన, పరిశుభ్రత, సేవ భావం, చారిటీ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని రబీంద్ర రత్న పురస్కారం అందజేశారని తెలిపారు. తనకు వచ్చే అవార్డులు పురస్కారాలు తన బాధ్యతను మరింత పెంచుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. తన ఉన్నతి కి, ఆశయ సాధనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

నాటు సారా తయారీ కేంద్రంపై దాడులు

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని బందంచర్ల గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డీఎస్పీ కె. జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. 20లీటర్లు నాటు సారాను, 1500 లీటర్లు బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని, 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి సారా తయారీకి ఉపయోగించే ప్లాస్టిక్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లుగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు.

ఆదిత్యలో ముగిసిన శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్ సారథ్యంలో ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై విద్యార్థుల అభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజ్ఞానాదయంగా ముగిసింది. ఈ కార్యక్రమం అయిదు రోజుల పాటు కొనసాగింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని రేవంత్ గ్లోబల్ టెక్నాలజీస్‌లో విశేష సేవలు అందిస్తున్న పి రమా కాంత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగంలోని తృతీయ సవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి అని డీన్ అకాడమిక్స్ డాక్టర్ పుల్లెల రవికుమార్ అన్నారు. అలాగే ఇటువంటివి మెకానికల్ విద్యార్థులకి చాల అవసరం అని డీన్ ఐక్యూఏసి డా జి రామ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వైకెఎస్ సుబ్బా రావు, వర్క్ షాప్ కోఆర్డినేటర్ నల్ల భాను తేజ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.